# చిత్రం

తాగ్రోడ్డుని కేన్వాసుగా చేసుకుని
సూర్యుడి వెలుగు నీడల పర్యవేక్షణలో
రంగు రంగుల కలగలుపుతో రమ్యంగా అతను
ఒక రోజు రోజంతా శ్రీరామ చంద్రుడవుతాడు
కాలే కడుపుతో కూడా
అతన్నే వాటేసుకుని పడుకుని
మర్నాటికి అరిగిపోయి చెరిగిపోయి
వీరాంజనేయుడవుతాడు
సాయి బాబా అవుతాడు
ఏసు ప్రభువు అవుతాడు
గాంధీ అవుతాడు
నేతాజీ అవుతాడు
నీరవంగా దీనంగా వెయ్యి కళ్లతో గమనిస్తాడు
వేషాలో మోసాలో నిజాలో తెలీని
అతి పవిత్ర భక్తాగ్రేసరుల్లా వెళ్తున్న వాళ్లని
నాయకుల నామస్మరణ నినాదాలుగా ఉరుకుతున్న వాళ్లని
యంత్రాల్లా నడుస్తున్న వాళ్లని
ఊహాలోకాల్లో విహరిస్తున్నట్టుగా సంచరిస్తున్న వాళ్లని
రేపటి కోసం ఊహించటానికి కూడా
భయపడుతున్నట్టుగా పోతున్న వాళ్లని
వారిలో-
ఈసడించే కళ్లని
పట్టించుకోని కళ్లని
చూసి చూడని కళ్లని
తమాషాగా చూసే కళ్లని
తప్పించుకు తిరిగే కళ్లని

తన్మయత్వంతో చూసే కళ్లని
ఏ కళ్లైనా –
భక్తి, దయ, సానుభూతి, కళారాధన
వగైరా వగైరాలతో నైనా
చిల్లర పైసలుగా మారతాయేమోనని
పాయసం కాకపోయినా చల్లటి మజ్జిగైనా పోస్తాయేమోనని
చూస్తూ చూస్తూనే
వెలుగు నీడల బాధ్యత
వీధి దీపాల దయ్యేసరికి
ఆ అవతారాల ముందే అతను
రాలి పోయిన అగరొత్తయి
మగ్గిపోయి మాగిపోయిన అరటి పండై
గాలికి ఎగిరిపోగా మిగిలిన రంగుల ముగ్గై
అతనే ఒక చిందరవందర చిత్రమై . . . . . . .